

## 94.14 శాతం పింఛన్ల పంపిణీ

**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**

జిల్లా వ్యాప్తంగా 2.69 లక్షల మంది పింఛనుదారులు ఉండగా శనివారం సాయంత్రం 6 గంటలకు 94.14 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేశామని డిఆర్‌డిఎ పీడీ నర్సయ్య తెలిపారు. ఉదయం 6 గంటలకే పింఛను పంపిణీ ప్రారంభం అయ్యిందన్నారు. మంత్రి సవితమ్మ పరిగిలో, కలెక్టర్ టిఎస్ చేతన్ కొత్తచెరువులో పింఛన్లను పంపిణీ చేశారు.



పరిగిలో పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి సవితమ్మ

## వర్షాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**

వాతావరణ శాఖ వెల్లడించిన ప్రకారం రెండు రోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ టిఎస్.చేతన్ సూచించారు. శనివారం నాడు కలెక్టరేట్ నుంచి నోడల్ అధికారులు, ఆర్డీవోలు, మున్సిపల్ అధికారులు, తహశీల్దార్లతో ముందస్తు చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. తుపాన్ నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ వర్షాల వల్ల జిల్లాలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. మూడు రోజులపాటు మండల, డివిజన్ స్థాయి అధికారులు మండల కేంద్రాల్లో ఉండి ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. వంతెనల వద్ద నీరు పారే సమయంలో ఎవరూ వెళ్లకుండా చూడాలన్నారు. జిల్లాస్థాయిలో పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 08885-292432 నెంబర్‌కు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజలు కూడా ఏదేని విపత్తు జరిగితే ఈ నెంబర్ కు సమాచారం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు.



టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

## ఆన్‌లైన్‌లో గణేష్ ఉత్సవాలకు అనుమతులు : ఎస్పీ

**ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్**



ఎస్పీ వి.రత్న

సింగిల్ విండో విధానంతో గణేష్ ఉత్సవాల అనుమతులు సులభంగా పొందే విధంగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక పోర్టల్ ద్వారా నిర్వాహకులు అనుమతులు పొందవచ్చని ఎస్పీ వి. రత్న శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలిపారు. ప్రత్యేక పోర్టల్‌తో పాటు చాట్, బాట్ సేవలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. 7995095800 మొబైల్ నంబర్‌కు వాట్సాప్ ద్వారా హాయ్ అని సందేశం పంపిస్తే ఎన్ఒసి పత్రం కోసం అనుసరించాల్సిన ప్రక్రియ మొత్తం సంబంధిత వాట్సాప్‌కి వస్తుందన్నారు. ఈ విధానంతో ప్రజలు సులభతరంగా గణేష్ ఉత్సవాల నిర్వహణ, మండపాల ఏర్పాటు, ఊరేగింపులు, నిమజ్జనంకు మీ-సేవలో చలానా రుసుంను చెల్లించి, నిరభ్యంతర పత్రం క్యూఆర్ కోడ్‌ను పొందవచ్చనన్నారు. జిల్లాలో గణేష్ ఉత్సవాలను నిర్వహించే నిర్వాహకులు సింగిల్ విండో విధానంలో వివరాలను పూర్తి చేసి, అనుమతులు పొందాలని సూచించారు. అనుమతులను, క్యూఆర్ కోడ్ ను ఉత్సవాలను నిర్వహించే పందిరిలో తనిఖీలకు వచ్చే అధికారులకు అందుబాటులో ఉంచాలని కోరారు. గణేష్ ఉత్సవాల నిర్వహణకు అనుమతులు పొందాలనుకునే వారు https://ganeshutsav.net వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యి, న్యూ అప్లికేషన్ మీద క్లిక్ చేసి అందులో కన్పించే దరఖాస్తులోని వివరాలు అన్నింటినీ పూర్తి చేసి అనుమతులు పొందవచ్చన్నారు. ప్రశాంత వాతావరణంలో చవతి ఉత్సవాలు నిర్వహించుకునేలా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.



# యువతోత్సాహం

◆ దులీప్ క్రికెట్ టోర్నీకి పాసుల పంపిణీ షురూ

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

అనంతపురంలో క్రికెట్ సందడి మొదలైంది. ఆర్డీటీ క్రీడాగ్రామం వేదికగా దిగ్గజ క్రికెటర్లు క్రీడాభిమానులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. జాతీయ స్థాయి క్రికెటర్లతో కూడిన దులీప్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్‌కు అనంతపురం వేదికకానుంది. అనంతపురం నగర శివారులోని ఆర్డీటీ స్పోర్ట్స్ అకాడమీలో 5వ తేదీ నుంచి 22వ తేదీ వరకు దులీప్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చకచకా చేస్తున్నారు. మ్యాచ్‌లు వీక్షించేందుకు శనివారం పాస్‌లు జారీ చేయడంతో క్రికెట్ అభిమానులు వేలాదిగా ఆర్డీటీ స్టేడియంకు చేరుకున్నారు. శనివారం ఉదయం నుంచే యువత పెద్ద ఎత్తున ఆర్డీటీ స్టేడియం వద్దకు చేరుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసు బందోబస్తు మధ్య దాదాపు 10 వేల పాస్‌లు పంపిణీ చేశారు. పాస్‌లు పొందిన యువత సంతోషాన్ని వ్యక్తం చేశారు. తమ అభిమాన క్రికెటర్లను చూడబోతున్నామంటూ ఆర్డీటీ స్టేడియం వద్ద సందడి చేశారు.

**ఇదొక గొప్ప అవకాశం..**

అనంతపురం జిల్లాలో దులీప్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం గొప్ప అవకాశం అని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) త్రీమెన్ కమిటీ సభ్యుడు మాంఛో ఫెర్రర్ అన్నారు. శనివారం ఆయన టికెట్ పంపిణీతో పాటు స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మాంఛో ఫెర్రర్ మీడియాతో మాట్లాడుతూ క్రికెట్ ప్రేమికులకు ఇదొక అరుదైన అనుభూతినిచ్చే వేడుక అన్నారు. అంతర్జాతీయ పోటీల తర్వాత జాతీయ క్రీడాకారులకు అత్యంత ప్రధానమైనది దులీప్ ట్రోఫీ అన్నారు. స్పోర్ట్స్ విలేజ్‌లో ఒకేసారి రెండు మ్యాచ్‌లు నిర్వహిస్తున్నప్పటికీ ప్రేక్షకులు తిలకించేందుకు ఒక మైదానంలోకి మాత్రమే అనుమతిస్తామన్నారు. బి గ్రౌండ్‌లో కూర్చుకునేందుకు ఎలాంటి సౌకర్యాలూ లేనందున అక్కడికి ఎవరినీ అనుమతించరన్నారు. మ్యాచ్‌లు స్టార్ స్పోర్ట్స్, జియోలో ప్రత్యక్ష ప్రసారం అవుతాయని వెల్లడించారు. మ్యాచ్ నిర్వహణ కోసం క్రికెట్ అభిమానులు సహకరించాలని కోరారు. మ్యాచ్‌లు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరిస్తే మున్ముందు అనంతపురం జిల్లాకు బీసీసీఐ మరిన్ని మ్యాచ్‌లు కేటాయించేందుకు అవకాశం ఉంటుందని మాంఛో ఫెర్రర్ పేర్కొన్నారు.

◆ పాస్‌ల కోసం వేలాదిగా తరలొచ్చిన క్రికెట్ అభిమానులు
◆ 5వ తేదీ నుంచి దులీప్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్
◆ 'అనంత'కు జాతీయ స్థాయి క్రికెటర్లు రాక
◆ అరుదైన అనుభూతినిచ్చే వేడుక
◆ ఏసీఏ త్రీమెన్ కమిటీ సభ్యుడు మాంఛో ఫెర్రర్

**భారీ భద్రత..**

క్రికెట్ మ్యాచ్‌కు పోలీసులు భారీ భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు. మ్యాచ్ నిర్వహించే సమయంలో స్టేడియం చుట్టు పక్కల పెద్ద ఎత్తున పోలీసు బలగాల పర్యవేక్షణ ఉంటుందని అనంతపురం రూరల్ డీఎస్పీ ఎంవి.శివారెడ్డి వెల్లడించారు. స్టేడియం సమీపంలోనే ప్రత్యేకంగా వాహనాల కోసం పార్కింగ్ ఏర్పాటు చేశామన్నారు. మ్యాచ్‌లు జరిగే రోజున ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు మాత్రమే గ్రౌండ్‌లోకి ప్రవేశం ఉంటుందన్నారు. ఆ తర్వాత గేట్లు మూసివేస్తామని తెలిపారు.



మ్యాచ్‌లను చూసేందుకు జారీ చేసే పాస్‌ల కోసం ఆర్డీటీ స్టేడియం వద్ద క్యూలో నిల్చున్న క్రికెట్ అభిమానులు



పాస్ పంపిణీని ప్రారంభిస్తున్న డీఎస్పీ శివారెడ్డి

## గురుకులాలను గాడిలో పెడతాం : మంత్రి సవిత

**ప్రజాశక్తి - చిలమత్తూరు**

వైసిపి పాలనలో అస్తవ్యస్తంగా మారిన గురుకుల పాఠశాలలను గాడిలో పెడతామని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. నాడు-నేడు పనులపై కూడా విచారణ చేపడతామన్నారు. మంత్రి శనివారం స్థానిక గురుకుల పాఠశాలను సందర్శించి మరుగుదొడ్లు, తాగునీరు, వంటగదులను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. స్టాక్ రికార్డుల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని, ఇకపై ప్రతి రికార్డునూ సక్రమంగా నిర్వహించాలని ప్రిన్సిపల్ జయసింహనాయుడును ఆదేశించారు. గురుకుల హాస్టల్‌కు విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఉండాలని, విద్యార్థుల స్నానానికి వేడి నీరు అందించాల న్నారు. సరిపడా హాస్టల్ గదులు, పాఠశాల ప్రహరీ నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తామన్నారు. మంత్రి వెంట టిడిపి మండల కన్వీనర్ రంగారెడ్డి, గంగాధర్, అశ్వర్థప్ప, మల్లికార్జున, నరేంద్ర, రామంజనమ్మ పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం తింటున్న మంత్రి సవిత

**పింఛను పంపిణీ చేసిన మంత్రి**

**పరిగి :** ఎన్టీఆర్ భరోసా పింఛను పంపిణీ కార్యక్రమంలో భాగంగా శనివారం మంత్రి సవిత మండల కేంద్రమైన పరిగిలోని దళిత కాలనీలో అశ్వత్థమ్మ, నారాయణమ్మ వృద్ధుల ఇంటి వద్దకు వెళ్లి రూ. 4వేల చొప్పున పింఛను పంపిణీ చేశారు. అనంతరం సీతారామపురం, బోయపేట, 90 హౌసెస్ కాలనీల్లో పర్యటించారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేసి నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిని సందర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో విష జ్వరాలు ప్రబలుతున్నాయని డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండి రోగులకు అవసరమైన వైద్యం అందించాలని ఆదేశించారు. వైద్యుల వినతి మేరకు త్వరలో నిధులు కేటాయించి సమావేశ భవనం నిర్మిస్తానని హామీ ఇచ్చారు. ఊటకూరులో పిహెచ్‌సికి స్థలం కేటాయించి నూతన భవనం నిర్మించాలని బీచిగానిపల్లి, శాసనకోట, సిగిపల్లి, ఎర్రగుంట, విట్టాపల్లి పంచాయతీల ప్రజలు మంత్రికి విన్నవిం చారు. మంత్రి వెంట తహశీల్దార్ హసీనా సుల్తానా, ఎంపిడిఒ సరస్వతి, టిడిపి మండల కన్వీనర్ గోవింద్‌రెడ్డి, నాయకులు సూర్యనారాయణ, సత్యనారాయణ, బాలాజీ, లక్ష్మణరావు, నారాయణరెడ్డి, సోమప్ప, డిఎస్ఎల్ శ్రీనివాసులు, కంకర శ్రీనివాసులు, చౌడప్ప పాల్గొన్నారు.

## ప్రజలను ఇబ్బంది పెడితే ఉపేక్షించం : కందికుంట

**ప్రజాశక్తి-కదిరి అర్బన్**





అధికారిని ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

ప్రజలను ఇబ్బంది పెడితే ఉపేక్షించమని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ కదిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందిని హెచ్చరించారు. ఎమ్మెల్యే శనివారం ఉన్నఫళంగా కదిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పలుమార్లు ప్రజలు, బిల్డర్లు ఫిర్యాదులు చేశారని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సకాలంలో సక్రమంగా పనులు జరుగుతుంటే ప్రజలు తమ కార్యాలయానికి వచ్చి ఎందుకు ఫిర్యాదు చేస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వ సొమ్ము తీసుకొని ప్రజల పక్షాన పని చేయాల్సిన అధికారులే అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇకనైనా సమయపాలన పాటిస్తూ ప్రజలను ఇబ్బంది పెట్టకుండా సమయానికి పనులు చేసి పంపాలని, లేనిచో ప్రజల మధ్య నిల్చొని సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంటుందన్నారు. పని ఆలస్యంపై ఎమ్మెల్యే ప్రశ్నించగా అధికారి మౌనమే సమాధానంగా మారింది. కార్యాలయంలో అధికారుల పనితీరు, ఇతర అంశాలపై ఎమ్మెల్యే ఆరా తీశారు. ఇకనైనా అధికారులు పనితీరు మార్చుకోకపోతే తగిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో హెచ్చరించారు.

## 'నా వద్దకే వచ్చి పింఛను తీసుకోండి'..!

### లబ్ధిదారులను ఇబ్బంది పెట్టిన వెల్ఫేర్ అసిస్టెంట్

**ప్రజాశక్తి-హిందూపురం**

హిందూపురం మండలం కిరికెర పంచాయతీ మిట్టమీదపల్లి గ్రామంలో పింఛన్ల పంపిణీని నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు ఇవ్వాల్సి ఉండగా గ్రామ వెల్ఫేర్ అసిస్టెంట్ ఓ నివాసం వద్ద లబ్ధిదారులు అందరినీ అక్కడికి రమ్మని పింఛన్ పంపిణీ చేశారు. ఇంటికి వచ్చి ఇవ్వమని కొంత మంది వృద్ధులు, వికలాంగులు కోరినప్పటికీ ఆయన పట్టించుకోలేదు. తనవద్దకే వచ్చి పింఛన్ తీసుకెళ్లాలని ఆదేశాలు జారీ చేశాడు. దీంతో ఏమి చేయలేని వృద్ధులు, వికలాంగులు సెక్రటరీ ఉన్న చోటికే వెళ్లి పింఛన్ తీసుకున్నారు. ఓ వైపు జిల్లాలో మంత్రి సవితమ్మ, కలెక్టర్ టిఎస్.చేతన్ లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ అందిస్తుంటే కిరికెకర సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ అందరినీ ఒక చోటుకు రమ్మని పింఛన్ ఇవ్వడంపై గ్రామస్తులు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మిట్టమీద పల్లి గ్రామంలో ఓ నివాసం వద్ద పింఛన్ పంపిణీ చేస్తున్న సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్

## 13 ఏళ్ల తర్వాత కేసు కొట్టివేత

**ప్రజాశక్తి-హిందూపురం**

13 ఏళ్లకు ముందు చిలమత్తూరు మండలం కొడికొండ చెక్ పోస్టు వద్ద జరిగిన సంఘటనకు సంబంధించి నమోదైన కేసును శనివారం స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో కొట్టివేశారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. 2012 సంవత్సరంలో చిలమత్తూరు మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సాయి యేసు పాఠశాలకు విద్యార్థులను తీసుకుని వస్తున్న బస్సు రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు మతి చెందడంతో విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ఎస్ఎఫ్ఐ నాయకులు, స్థానికంగా పలువురు యువకులు పెద్ద ఎత్తున కొడికొండ చెక్ పోస్టు వద్ద ఉన్నా రహదారిపై ఆందోళన చేశారు. అప్పట్లో 60 మందిపై పోలీస్ అధికారులు కేసులు నమోదు చేశారు. కేసు విచారణ సమయంలోనే ఆరుగురు నిందితులు మతి చెందారు. మిగిలిన 54 మందిపై నేరం రుజువు కాకపోవడంతో శనివారం నాడు కేసును కొట్టివేస్తూ సీనియర్ సివిల్ జడ్జి మానిపాటి శ్రీధర్ తీర్పు చెప్పారు. నిందితుల తరపున సీనియర్ న్యాయవాది రామచంద్రారెడ్డి, కృష్ణమూర్తి వాదనలు విన్పించారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ ఇందాద్ వాదించారు. 13 ఏళ్ల అనంతరం కేసు కొట్టేయడంతో అందులో నిందితులుగా ఉన్న కుటుంబాలు ఆనందరం వ్యక్తం చేశాయి.

## 14న జాతీయ మెగా లోక్ అదాలత్

**ప్రజాశక్తి-హిందూపురం**

ఈ నెల 14వ తేదీన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు జాతీయ మెగా లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ తెలిపారు. శనివారం నాడు అదనపు జిల్లా కోర్టు ఆవరణలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్, జూనియర్ సివిల్ జడ్జి లలిత లక్ష్మితో కలిసి పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయా స్టేషన్‌ల పరిధిలో రాజీ అయ్యే కేసుల పరిష్కారానికి పోలీసులు సహకరించాలని అదనపు జిల్లా జడ్జి కోరారు. రాజీ మార్గంలో కేసులో పరిష్కరించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను కక్షిదారులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహేష్, ఏపీపీ ఇందాద్, ఏజీపీ శ్రీనివాస్ రెడ్డి, సిఐలు రాజగోపాల్ నాయుడు, అబ్దుల్ కరీం, జనార్ధన్, ఎస్ఐలు మునీర్ అహ్మద్, గోపి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ

## 'సత్యసాయి' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు





ఎంపిడిఒ సాయిమనోమర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఓబులు, సత్యసాయి కార్మికులు

**ప్రజాశక్తి-బత్తలపల్లి**

సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రతతో పాటు పలు డిమాండ్ల సాధన కోసం సత్యసాయి కార్మికులు చేపట్టిన సమ్మె పదో రోజుకు చేరుకుంది. సిఐటియు ఆధ్వర్యంలో శనివారం స్థానిక సత్యసాయి వాటర్ పంపు హౌస్ వద్ద కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. వారి దీక్షకు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు మద్దతు తెలిపి మాట్లాడారు. సత్యసాయి తాగునీటి పథకం లో కొన్నేళ్లుగా పని చేస్తున్నా కార్మికులు ఉద్యోగ భద్రత లేదని, ఆరు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని, ఈఎస్, ఈపీఎఫ్ డబ్బులు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సత్యసాయి కార్మికులు పది రోజులుగా నీటి సరఫరాను నిలిపివేసి సమ్మెలో పాల్గొంటున్నా ఉన్నతాధికారులు గానీ, ప్రజా ప్రతినిధులు గానీ స్పందించకపోవడం విచారకరమన్నారు. అనంతరం ఎంపిడిఒ సాయి మనోహర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు శ్రామిక మహిళా కన్వీనర్ దిల్షాద్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, సిఐటియు నాయకులు, సత్యసాయి కార్మికులు ఈశ్వరయ్య, రవి ఆచారి, తిరుపాలు, మస్తాన్, నరేష్, లక్ష్మీరెడ్డి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

### తప్పిన పెను ప్రమాదం

**ప్రజాశక్తి-బత్తలపల్లి**

విద్యార్థులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో స్తంభం విరిగి ఆర్టీసీ బస్సు పై పడింది. అయితే బస్సు స్తంభాన్ని ఢీకొనగానే విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ సంఘటన శనివారం మండలంలోని అనంతసాగరం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. మండలంలోని మాల్యవంతం పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల నుంచి నరసింహపల్లిలోని జెవిఆర్ పాఠశాలకు 60 నుంచి 70 మంది విద్యార్థులు ఆర్టీసీ ప్రత్యేక బస్సులో వెళ్తుంటారు. సాయంత్రం యథావిధిగా విద్యార్థులను మాల్యవంతం, ఎం.చెర్లోపల్లిలో దింపి ఆ తర్వాత బస్సు అనంతసాగరం వెళ్లింది. అక్కడ విద్యార్థులను దింపి లింగారెడ్డిపల్లికి వెళ్తుండగా రహదారి పక్కనే లింగాచారి ఇంటి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. బస్సు ఢీ కొనగానే విద్యుత్ మెరుపులతో స్తంభం విరిగి బస్సుపై పడింది. వెను వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌లో ఫీజులు ఎగిరిపోవడంతో సరఫరా ఆగిపోయింది. దీంతో బస్సులో ఉన్న లింగారెడ్డిపల్లి, వెంకటగారిపల్లి గ్రామాలకు చెందిన 40 మంది విద్యార్థులను బస్సులో నుంచి కిందికి దింపేశారు. విద్యార్థులకు, బస్సుకు ఎలాంటి ప్రమాదం జరగపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాద విషయం తెలియగానే పోలీసులు, విద్యుత్ సిబ్బంది గ్రామానికి వెళ్లి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.

## సైబర్ నేరగాళ్ల నయా మోసం

**ప్రజాశక్తి-పరిగి**

సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ శృతి మించడంతో పోలీసులను ఆశ్రయిస్తున్న బాధితుల సంఖ్య పెరుగుతుందని చెప్పవచ్చు. మండలంలోని నరసాపురం, వన్నంపల్లి గ్రామాలకు చెందిన ఇద్దరు బ్యాంకు ఖాతాల నుంచి సైబర్ నేరగాళ్లు రూ. 65 వేలు కాజేయడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. వివరాలు.. నరసాపురం అంగన్వాడీ కార్యకర్త అచ్చమ్మ 15 ఏళ్లగా ఉద్యోగిగా పని చేస్తుంది. శనివారం సైబర్ నేరగాళ్లు తాము వైద్య ఆరోగ్య శాఖకు చెందిన వారమని, మీ పరిధిలో ఉన్న బాలింతల వివరాలతో పాటు వారి ఫోన్ నెంబర్లు, బ్యాంకు ఖాతా నెంబర్లు పంపిస్తే ప్రభుత్వం సాయం కింద రూ. 15వేలు ఖాతాలో వేస్తామని నమ్మబలికారు. దీంతో ఆమె వద్ద ఉన్న బాలింతల వివరాలు తెలియజేసింది. ఈ సమాచారంతో వారు మంజుళకు ఫోన్ చేసి వారి వివరాలు అడిగి తెలుసుకుని వారి ఖాతా నుంచి రూ. 25వేల కాజేశారు. అలాగే వన్నంపల్లికి చెందిన అంగన్వాడీ కార్యకర్త కాంతమ్మకు ఫోన్ చేసి వివరాలు తీసుకొని ముంతాజ్ అనే బాలింతకు ఫోన్ చేయగా ఆమె భర్త ఇస్మాన్ జబివుల్లా ఫోన్ ఎత్తారు. అతడికి అలాగే చెప్పి ఫోన్ పే నెంబర్ అడిగడంతో ఏవో కారణాల వల్ల అతడు తాను పనిచేస్తున్న షాపు ఓనర్ అప్రోజ్ నెంబర్ ఇచ్చారు. దీంతో ఆరు అప్రోజ్ ఖాతా నుంచి రూ. 40 వేలు కాజేశారు. చివరకు మోసపోయామన్న విషయం తెలుసుకున్న బాధితులు ఎస్ఐ రంగడుకు ఫిర్యాదు చేశారు.

## రోడ్లపై బైక్ విన్యాసాలు చేస్తే చర్యలు : డీఎస్పీ

**ప్రజాశక్తి-హిందూపురం**

హిందూపురం పట్టణంతో పాటు రహదారుల్లో రోడ్లపై బైక్ రేస్‌లను నిర్వహిస్తూ ప్రజలు, ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ మహేష్ హెచ్చరించారు. శనివారం హిందూపురం నాడు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో రోడ్లపై బైక్ రేసులు నిర్వహించే యువకులకు డీఎస్పీ కౌన్సిలింగ్ ఇచ్చారు. బైక్ రేస్‌లకు పాల్పడితే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ సిఐ అబ్దుల్ కరీం, సిబ్బంది పాల్గొన్నారు.

## వృద్ధులకు అన్నదానం

**ప్రజాశక్తి-హిందూపురం**

లేపాక్షి దుర్గాపానేశ్వర ఆలయ ఛైర్మన్ కరణం రమానందన్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన స్నేహితులు ముద్దిరెడ్డిపల్లిలో ఉన్న రూపశ్రీ వద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుర్గా నాని, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, సడ్లపల్లి వెంకటేష్ రెడ్డి, నాగేపల్లి వెంకటరామిరెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, బాలకష్ణ రెడ్డి పాల్గొన్నారు.

## 'టోల్' వసూలుపై ఆగ్రహం

### చోళసముద్రం టోల్‌ప్లాజా వద్ద స్థానికుల ఆందోళన

**ప్రజాశక్తి-లేపాక్షి**

లేపాక్షి మండల పరిధిలోని చోళసముద్రం వద్ద టోల్ వసూళ్లపై పరిసర గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. టోల్‌గేట్ సమీపంలోని గ్రామస్తులతో డబ్బులు తీసుకోరాదని డిమాండ్ చేస్తూ శనివారం ఉదయం టోల్ ప్లాజా వద్ద లారీలను అడ్డుగా నిలిపి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ స్థానికులు లారీలకు సరుకు వేసుకుని వెళ్తే రూ.100, ఖాళీగా వెళ్తే రూ.50 వసూలు చేస్తున్నారని చెప్పారు. ఈ భారం నుంచి స్థానికులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. దీనిపై టోల్‌గేట్ గుత్తేదారుడు చర్చలు జరిపాడు. స్థానికులకు టోల్ వసూలు నుంచి మినహాయింపు ఇస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ జయప్ప, మాజీ కో ఆప్షన్ సభ్యుడు షెక్షావలి, లారీ యాజమానులు పాల్గొన్నారు.





టోల్‌గేట్ వద్ద లారీలు అడ్డుపెట్టి నిరసన తెలుపుతున్న గ్రామస్తులు



ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న జెసి అభిషేక్ కుమార్

## ఇసుక స్టాక్ పాయింట్లపై ప్రత్యేక దృష్టి:జెసి

**ప్రజాశక్తి-ముదిగుబ్బ**

మండలంలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని, ఇసుక స్టాక్ పాయింట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశించారు. జెసి శనివారం మండలంలోని బూదనవాండ్లపల్లి సమీపంలోని కొడవాండ్లపల్లి ఇసుక రీచ్‌ను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జెసి మాట్లాడుతూ ఇసుక వినియోగదారులకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. వినియోగదారులకు ఇసుక అందించేటప్పుడు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. మండలంలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేలా చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని పోలీసులను ఆదేశించారు. రెవెన్యూ సిబ్బంది తప్పనిసరిగా ఇసుక రీచ్ వద్ద ఉండాలని, లేనిచో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇసుక తరలించే వాహనాలకు రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. జెసి వెంట ధర్మవరం ఆర్‌డిఓ వెంకట శివరామిరెడ్డి, డిఎస్‌పి శ్రీనివాసులు, ముదిగుబ్బ సిఐ యతీంద్ర, తహశీల్దార్ మునిస్వామి, సంబంధిత అధికారులు ఉన్నారు.



నూతన బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజు, గుండుమల తిప్పేస్వామి

## నూతన ఆర్టీసీ బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే

**మడకశిర :** పట్టణంలోని అమరాపురం బస్టాండ్‌లో శనివారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి నూతన ఆర్టీసీ బస్సును ప్రారంభించారు. ఈ బస్సు రోజూ ఉదయం 7:30 గంటలకు మడకశిరలో బయల్దేరి పెనుకొండ, ఎస్‌ఎస్ గేట్, అనంతపురం, గుత్తి, డోన్ మీదుగా కర్నూలు వెళ్లి తిరిగి అదే రోజు సాయంత్రం 9 గంటలకు మడకశిరకు చేరుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

**ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం**

మారుమూల ప్రాంతాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు కంటి పరీక్షలు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, జనసేన స్వామీజీ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన శారదాదేవి ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, కమిషనర్, కళాశాల ప్రిన్సిపల్ శారదాదేవి, కంటి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలి

**ప్రజాశక్తి-కదిరి టౌన్**



సదస్సులో మాట్లాడుతున్న సిఐ మోహన్

ప్రతి ఒక్కరూ విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలని రూరల్ అర్బన్ సిఐ మోహన్ సూచించారు. చెడు వ్యసనాలకు బానిస అయితే భవిష్యత్తు నాశనం అవుతుందని, వాటికి దూరంగా ఉండాలని హెచ్చరించారు. రూరల్ పరిధిలోని ఎరుకలవాండ్లపల్లి సమీపంలో ఉన్న హరీష్ పాఠశాలలో శనివారం ప్రిన్సిపల్ ఎంఎస్.కిరణ్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. సిఐ మాట్లాడుతూ యువత, విద్యార్థులు గంజాయి, డ్రగ్స్, మాదక ద్రవ్యాలు, తదితర చెడు అలవాట్లకు బానిసై పోలీసులకు పట్టుబడితే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఎవరికైనా వాటి గురించి తెలిస్తే నా పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. విద్యార్థినులను ఎవరైనా ఇబ్బందులకు గురిచేసినా, ఏదైనా సమాచారం ఇవ్వాలనుకున్నా 94409 01882 కానీ లేదా 100, 1930 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు. అనంతరం ప్రిన్సిపల్ సిఐని పూలమాల, శాలువాతో సన్మానం చేశారు. కార్యక్రమంలో ఎఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బాలయ్య సినీ స్వర్ణోత్సవ సంబరాలు నిర్వహిస్తున్న అభిమానులు

## ఘనంగా బాలయ్య సినీ స్వర్ణోత్సవ సంబరాలు

**కొత్తచెరువు :** హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సినీ రంగ ప్రవేశం చేసి 50 ఏళ్ల పూర్తయినందున శనివారం టిడిపి ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద స్వర్ణోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచి పెట్టారు. వారు మాట్లాడుతూ బాలయ్య సమాజానికి ఉపయోగపడే ఎన్నో చిత్రాల్లో నటించి రాష్ట్రవ్యాప్తంగా ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్నారన్నారు. అలాగే హిందూపురం ఎమ్మెల్యేగా మూడు పర్యాయాలు ఎంపికై ప్రజలకు సేవలు అందిస్తున్నారన్నారు. బసవతారకం హాస్పిటల్ ద్వారా పేద ప్రజలకు క్యాన్సర్ వైద్య చికిత్సలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్.శ్రీనివాసులు, టౌన్ కన్వీనర్ ఒలిపి శ్రీనివాసులు, కన్వీనర్ రామకృష్ణ, నాయకులు సైకిల్ షాప్ బాబా, పెద్దన్న, కిరణ్, నాగేంద్ర, ఎస్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెల కాపరి ఆత్మహత్యకు కారకులను అరెస్టు చేయాలి

**ప్రజాశక్తి-కొత్తచెరువు**

మండలంలోని లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన గొర్రెలకాపరి శ్రీరాములు గత శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఓ మహిళ ఆదివారం పెళ్లిపై నిరాధార ఆరోపణలు చేయడంతో పాటు ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు చంపుతామని బెదిరించడంతో శ్రీరాములు ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. ఇందుకు కారకులైన నరసింహులు, నాగభూషణ, శ్రీరాములు, మరి కొంతమందిపై కేసులు నమోదు చేసి వారిని వెంటనే అరెస్టు చేయాలని శ్రీరాములు కుటుంబ సభ్యులు అంగడి ప్రభాకర్, చెన్నప్ప, పెద్దన్న, రామచంద్ర, నాగేంద్ర, తదితరుల ఆధ్వర్యంలో శనివారం సాయంకాలం నాలుగు రోడ్ల కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. దీంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించి 24 గంటల లోపు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరుస్తామని తెలపడంతో వారు రాస్తారోకో విరమించారు.



రోడ్డుపై బైఠాయించిన శ్రీరాములు కుటుంబ సభ్యులు, బంధువులు

# 'ఎపిని జగన్ అప్పుల పాలు చేశారు' : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-అమడగూరు**

వైసిపి పాలనలో జగన్ రెడ్డి ఎడాపెడా అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి విమర్శించారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా శనివారం ఎమ్మెల్యే మండలంలోని మలకవారిపల్లి తండా, మలకవారిపల్లి, తుమ్మలకొట్టువారిపల్లి గ్రామాల్లో పింఛనుదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛను మొత్తం అందజేశారు. అంతకుముందు మలకవారిపల్లి తండాలో గ్రామస్తులు ఎమ్మెల్యేతో పాటు మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డికి ఘన స్వాగతం పలి కారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న 195 చెరువులను నీటితో నింపుతామని తెలిపారు. మండల వ్యాప్తంగా గ్రామాలకు తాగునీరు అందించడానికి రూ. 115 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. మలకవారిపల్లితండాను ఆదర్శతండాగా తీర్చిదిద్దుతామని తెలిపారు. వారి వెంట టిడిపి నాయకులు గోపాల్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, శ్యాంబాబు, కాలే నాయక్, కృష్ణారెడ్డి, కుమార్‌రెడ్డి, చంద్ర, రాజారెడ్డి, కమ్మల భాస్కర్, సిద్ధు, అబ్దుల్ రవూఫ్, శరత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

**ఓబుళదేవరచెరువు :** మండలంలోని గాజుకుంట్లపల్లి పంచాయతీలో



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజు, గుండుమల తిప్పేస్వామి, తదితరులు



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

చేపట్టిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్ని పింఛన్లు పంపిణీ చేశారు. వారి వెంట టిడిపి మండల కన్వీనర్ జయచంద్ర, పీట్ల సుధాకర్, బోయపల్లి శివారెడ్డి, చాంద్‌బాషా, షబ్బీర్, శ్రీనివాసులు, నిజాం, జోలి బాబా, అంజన్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, రామానాయుడు, సర్పంచి శంకర్‌రెడ్డి, ఎంపిటిసి శ్రీనివాసులు, ఆరిఫ్‌ఖాన్, సోది నాగరాజు, అంజనప్ప, తదితరులు పాల్గొన్నారు.

**హామీ మేరకు పింఛన్లు పంపిణీ చేస్తున్న ఏకైక సిఎం చంద్రబాబు**

**మడకశిర :** ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం ప్రతి నెలా పింఛన్లు పంపిణీ చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తెలిపారు. వారు ఉదయం పట్టణంలోని చౌటుపల్లి గ్రామంలో అనంతరం సదాశివపురం, కదిరేపల్లి గ్రామాల్లో పింఛన్లు పంపిణీ చేశారు. వారి వెంట టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# చట్టాలపై అవగాహన అవసరం : సిఐ

**ప్రజాశక్తి-బత్తలపల్లి**

ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ధర్మవరం రూరల్ సిఐ ప్రభాకర్ సూచిం చారు. పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా శనివారం మండలంలోని గంటాపురం ఎస్సీ కాలనీలో ఉన్న ఆర్‌డిటి కమ్యూనిటీ హాలులో ఎస్ఐ శ్రీనివాసులు అధ్యక్షతన రాజ్యాంగంలోని చట్టాలు-పౌర హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. సిఐ మాట్లాడుతూ విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమన్నారు. చట్టాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. తప్పు చేస్తే దండనలు, పంచా యితీలు పెట్టి అజమాయిషీ చేయడం, కొట్టడం లాంటివి చట్ట విరుద్ధమన్నారు. ఏవైనా సమస్యలుంటే నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తెలపాలన్నారు. ఎస్ఐ మాట్లాడుతూ అన్యాయానికి గురైన వారు నేరుగా పోలీస్ స్టేషన్‌కు రావాలన్నారు. స్టేషన్‌కు వచ్చేందుకు ఎవరి ప్రమేయం అవసరం లేదన్నారు. మధ్య వర్తులు, నాయకులు వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం గ్రామంలో ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించారు. సదస్సులో ఎఎస్ఐ సోమశేఖరమూర్తి, వెల్ఫేర్ అసిస్టెంట్ మంజునాథ, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

**హక్కులు అందరికీ సమానమే**

**లేపాక్షి :** మండలంలోని మానేంపల్లి గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా తహశీల్దార్ సౌజన్య లక్ష్మి, సిఐ జనార్దన్ హాజరై మాట్లాడుతూ దేశంలో ప్రతి ఒక్కరికీ సమానమైన హక్కులు




లేపాక్షిలో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సిఐ జనార్ధన్

ఉంటాయన్నారు. కుల, మత, వర్గ, వర్ణ, బేధాలు లేవని మనువులంతా సమానమే అన్నారు. వారి హక్కులకు భంగం కలిగితే వాటిని చట్ట పరంగా వాటిని కాపాడుకోవచ్చు అన్నారు. గ్రామంలో వివక్షకు తావు లేకుండా సోదర భావంతో ఉండాలన్నారు. కార్యక్రమంలో పంచా యతీ కార్యదర్శి మల్లికార్జున, రెవెన్యూ అధికారి సూర్యనాగరాజు, ఎస్ఐ గోపి, గ్రామస్తులు పాల్గొన్నారు.

**నంబులపూలకుంట :** స్థానిక ఇంద్ర కాలనీ, ఆర్‌డిటి పాఠశాల వద్ద తహశీల్దార్ నరేంద్రకుమార్, ఎస్ఐ శ్రీధర్ ప్రజలకు పౌర హక్కులపై అవగాహన కల్పించారు. వివక్ష చూపినా, భూములు ఆక్రమించుకున్నా, ఆలయ ప్రవేశాన్ని అడ్డుకున్నా, తదితర అంశాల్లో న్యాయం కోసం నేరుగా తమను కలిసి సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. అలాగే వారి సమస్యలు తెలుసుకున్నారు.

# ఉద్యోగ విరమణ పొందిన ఈవోఆర్‌డికి సన్మానం

**ప్రజాశక్తి-గోరంట్ల**

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఈఓఆర్‌డిగా పని చేస్తున్న సుధాకర్ శనివారం ఉద్యోగ విరమణ పొందారు. దీంతో సుధాకర్‌ను శనివారం సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. డిపిఒ విజయ్‌కుమార్, ఎంపిడిఒ రఘునాథ్‌గుప్తా ఈఓఆర్‌డి సుధాకర్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి శివారెడ్డి, సర్పంచులు నర్సిరెడ్డి, ప్రభాకర్‌రావు, అశ్వర్థరెడ్డి, గంగప్ప, నరసింహ మూర్తి, శివశంకర్‌రెడ్డి, శివానంద, ముసలిరెడ్డి, అశ్వర్థరెడ్డి పాల్గొన్నారు

**బుక్కపట్నం :** స్థానిక పంచాయతీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన సంజీవరాజును శనివారం సర్పంచి నాగలక్ష్మిరాజు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సర్పంచి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సర్వసాధారణమని, విధి నిర్వహణలో తమ కర్తవ్యాలను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**లేపాక్షి :** స్థానిక ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఇందిరమ్మ



ఈఓఆర్‌డి సుధాకర్‌ను సన్మానిస్తున్న సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు

ఉద్యోగ విరమణ పొందగా ఘనంగా సన్మానించారు. డిఇఒ మీనాక్షి, సౌజన్య లక్ష్మి, టిడిపి మండల కన్వీనర్ జయప్ప, ఎంఇఒ నాగరాజు, కుళ్లాయప్ప, హైస్కూల్ హెచ్‌ఎం ధనశ్రీ ఆమెకు పూలమాల వేసి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో నాగసాయినాథ్, విజయ్ శేఖర్, రామదాసునాయక్, ఎపిటిఎఫ్ నాయకులు, సురేష్‌బాబు, యుటిఎఫ్ నాయకులు కొండారెడ్డి, హిదయతుల్లా ఖాన్, ఎస్టియు నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సమగ్ర శిక్షలో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**కొత్తచెరువు రూరల్ :** జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో ఖాళీగా ఉన్న సెక్టోరల్, అసిస్టెంట్ సెక్టోరల్ ఉద్యోగాలకు జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్ పాఠశాలల్లో పని చేస్తున్న పాఠశాలల సహాయకులు దరఖాస్తు చేసుకోవాలని డిఇఒ మీనాక్షి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను సెప్టెంబర్ 1 నుంచి 4వ తేదీ లోపు కార్యాలయ పని దినాల్లో జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయం ఓల్డ్ డైట్ కళాశాల బుక్కపట్నంలో సమర్పించాలన్నారు. పూర్తి వివరాలు deosss.blogspot.com కార్యాలయ నోటీసు బోర్డు లో ప్రదర్శించారని తెలిపారు.

## వర్షాకాలంలో విద్యుత్‌తో జాగ్రత్త

**ఓబుళదేవరచెరువు :** వర్షాకాలంలో విద్యుత్‌తో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎఇ రామసూరారెడ్డి సూచించారు. స్థానిక విద్యుత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తడిసిన చేతులతో విద్యుత్‌కు సంబంధించిన ఎలాంటి వస్తువులను ముట్టుకో వద్దన్నారు. విద్యుత్ లైన్‌కు తగులుతున్న చెట్లకు, తడిసిన విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాల న్నారు. విద్యుత్ లైన్‌కు చెట్టు కొమ్మలు తగులుతుంటే సంబంధిత అధికారికి తెలియజేయాలన్నారు. బయట పెట్టిన లైట్లు నీటితో తడవకుండా చూసుకోవాలన్నారు. పలు సూచనలు చేశారు.

## రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచాలి

**బుక్కపట్నం :** గ్రామీణ ప్రాంత క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మంచి ఫలితాలు సాధించాలని ఉమ్మడి జిల్లా ఫ్లోర్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ పూల ప్రసాద్ కోరారు. అండర్-18 విభాగంలో ఉమ్మడి జిల్లా ఫ్లోర్ బాల్ జూనియర్స్, సబ్ జూనియర్స్ బాలికల జట్టు సెప్టెంబర్ 1, 2 తేదీల్లో నరసరావుపేటలో జరిగే రాష్ట్రస్థాయిలో ఫ్లోర్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయి జట్టు రాష్ట్రస్థాయిలో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫ్లోర్ బాల్ అసోసియేషన్ ట్రెజరర్ ప్రసన్నకుమార్, పీఈటి స్వర్ణకుమారి, రమేష్‌బాబు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్**

పోలీసులతో పాటు హోంగార్డులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని రాయలసీమ రీజినల్ హోం గార్డ్స్ కమాండెంట్ ఎం.మహేష్ కుమార్ తెలిపారు. ఆయన శనివారం పట్టణంలోని పోలీస్ పరేడ్ మైదానంలో హోంగార్డ్స్ పరేడ్‌ను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ హోం గార్డులు పోలీస్ శాఖతో పాటు పలు ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్నారని, విధి నిర్వహణలో తీసుకోవా ల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. హోం గార్డ్స్ సంక్షేమానికి చేపట్టిన చర్యలను వివరించారు. హోంగార్డ్స్ సమస్యలను విన్నవించగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఆయన వెంట ఎఆర్ డీఎస్పీ జడ్.విజయకుమార్, ఆర్‌ఐలు చంద్రశేఖర్, ఆర్‌ఎస్ఐ, ఎఆర్ ఎస్ఐ, హోంగార్డ్స్ పాల్గొన్నారు.

## బిసి రక్షణ చట్టం తేవాలని సిఎం చంద్రబాబుకు వినతి

**పుట్టపర్తి క్రైమ్ :** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు బిసి రక్షణ చట్టం తీసుకురావాలని టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, రాయలసీమ బిసి సంఘం నాయకులు పట్టాల శ్రీరాములు శనివారం అమరావతిలోని టిడిపి కార్యాలయంలో సిఎం చంద్రబాబును కలిసి విన్నవించారు. వారు మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో అధిక శాతం బిసిలు టిడిపి కూటమి వెంటే ఉన్నారని, వెంటనే బిసి రక్షణ చట్టం తేవాలని కోరారు. అలాగే సత్యసాయి దర్శినార్థం పుట్టపర్తికి రావాలని ఆహ్వానించామన్నారు. స్పందించిన చంద్రబాబు త్వరలోనే బిసి రక్షణ చట్టం తెస్తామని హామీ ఇచ్చారన్నారు. వారు చంద్రబాబుకి సత్యసాయి చిత్రపటాన్ని అందజేశారు.



సిఎం చంద్రబాబుకి సత్యసాయి చిత్రపటం అందిస్తున్న సామకోటి, నాయకులు

# నేరాలు ఘోరాలు

## ప్రాణం మీదకు తెచ్చిన సెల్ఫీసరదా

### నీట మునిగి యువకుడు గల్లంతు

**చిలమత్తూరు :** సరదాగా సెల్ఫీ తీసుకునేందుకు వెళ్లి ఓ యువకుడు నీటమునిగి గల్లంతైన ఘటన మండలంలోని యగ్నిశెట్టిపల్లి వద్ద శనివారం చోటు చేసు కొంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... హిందూపురం పట్టణానికి చెందిన మహమ్మద్ కైఫ్(22) కుటుంబ సభ్యులతో కలిసి యగ్నిశెట్టిపల్లి సమీపంలోని శ్రీధరగుట్ట పైకి వెళ్లారు. ఎస్సార్సీ క్రషర్స్ వాళ్ళ కొండపై తవ్విన పెద్దపెద్ద గుంతల్లో ఇటీవల కురిసిన వర్షాలకు నీరు భారీగా చేరింది. మహ్మద్ కైఫ్ సెల్ఫీలు, వీడియోలు తీసుకుని రీల్స్ చేయాలని భావించి నీటిలో దిగాడు. నీటి లోతు ఎక్కువగా ఉండడంతో ఈత రాని అతని మరణించాడు. అక్కడే ఉన్న కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ మునీర్ అహ్మద్ ఆధ్వర్యంలో ఈతగాళ్ళు, ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని కైఫ్ కోసం గాలించారు. అయినా అతని ఆచూకీ లభించలేదు. చీకటి పడటంతో గాలింపు చర్యలను ఆపేశారు. ఆదివారం మళ్లీ గాలింపు చర్యలు చేపట్టనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

**గోరంట్ల రూరల్ :** మండలంలోని ఎమకలగుట్లపల్లి గ్రామంలో శనివారం ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఓ మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లారు. బాధితు రాలు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన శివమ్మ మధ్యాహ్నం సమయంలో ఇంటి బయట పాత్రలు శుభ్రం చేస్తుండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు వచ్చి శివమ్మ భర్త రంగారెడ్డితో తాము తహశీల్దార్ కార్యాలయం నుంచి వచ్చాము మీ ఆధార్ కార్డు ఇస్తే పింఛను పరిశీలన చేస్తామని నమ్మబలికారు. ఆధార్ కోసం రంగారెడ్డి ఇంట్లోకి వెళ్లగా శివమ్మ మెడలో బంగారు తాళి బొట్టు గొలుసు లాక్కొని ద్విచక్ర వాహనంపై ఉడాయించారు. గొలుసు విలువ రూ. 4 లక్షలు అని, గోరంట్ల సిఐ శేఖర్ కు ఫిర్యాదు చేశామన్నారు. అంతకుముందు కసిరెడ్డిపల్లి ఎస్సీ కాలనీలో రూ. 4 వేలు నగదు ఇస్తే ఈ రోజే మీకు పింఛను కార్డు మంజూరు చేయిస్తామని మోసం చేసే ప్రయత్నం చేయగా స్థానికులు అప్రమత్తమై వారిని పట్టుకోబోగా బైక్‌పై పారిపోయారని ఆ కాలనీవాసులు తెలిపారు.



ఇషికా మిరప రకంతో సాగు చేసిన పంటను పరిశీలిస్తున్న కనకధార కంపెనీ ప్రతినిధులు

## ఇషికా మిరపతో అధిక దిగుబడి

**రొద్దం :** ఇషికా మిరప రకంతో అధిక దిగుబడి సాధించవచ్చు అని 'కనకధార' కంపెనీ ప్రతినిధులు తెలిపారు. మండలంలోని పాతర్లపల్లి గ్రామానికి చెందిన రైతు మారుతి ఇషికా రకం మిరప సాగు చేయగా శనివారం ఆ కంపెనీ ప్రతినిధులు సందర్శించారు. మండలంలోని ఆర్.మరువపల్లి చెక్ పోస్ట్ వద్ద ఉన్న గంగరాజుకు చెందిన ఓం కాళీ వీర చౌడేశ్వరీ నర్సరీలో అనంతపురం నగరానికి చెందిన జెడ్ఎం నరసింహులు ఏజెన్సీ ద్వారా అందించిన 'కనకధార' కంపెనీకి చెందిన ఇషికా రకం విత్తనాలు సాగు చేయగా అధిక దిగుబడి ఇస్తున్నాయని తెలిపారు. 'కనకధార' కంపెనీ ప్రతినిధులు పంట దిగుబడిను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ రకం పైర్లు కావాల్సిన వారు 62818 42966 గంగరాజును సంప్రదించాలన్నారు. వారి వెంట సంస్థ సిబ్బంది జెడ్ఎం నరసింహులు, నర్సరీ గంగరాజు, రైతు మారుతితో పాటు తదితరులు ఉన్నారు.

## సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు

**ధర్మవరం రూరల్ :** వాతావరణంలో మార్పులు, తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాల వల్ల గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని ఎంపిడిఒ అబ్దుల్‌ఘని వైద్య ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఎఎన్ఎంలను ఆదేశించారు. అవసరమైన చోట్ల బ్లీచింగ్, దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని, గుంతల్లో నీరు నిల్వ ఉంటే ఆయిల్ బాల్స్ వేయాలని ఎంపిడిఒ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు.

## పేద విద్యార్థులకు ఆర్థికసాయం

**పెనుకొండ టౌన్ :** పట్టణంలోని శ్రీసత్యసాయి డిగ్రీ కళాశాల, శ్రీబాలాజీ విద్యాసంస్థల అధినేత పల్లె ఉమ వర్ధంతి సందర్భంగా శనివారం ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిశేషారెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ జూని యర్ కళాశాలలో విద్యార్థులు అఫ్రిన్, సంతోష్, నవదీప్‌లకు ఆర్థిక సాయం అందజేశారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ బాగా చదువుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమం లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సుదర్శన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ నరసింహమూర్తి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## బిసిల అభివృద్ధి, సంక్షేమానికి కృషి

**తనకల్లు :** మండల వ్యాప్తంగా బిసిల అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అందరి సహకారం తో ముందుకు వెళ్తానని మండల బిసి సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా ఎంపికైన పి.మల్లికార్జున తెలిపారు. తనకల్లులో శనివారం ఆయన మాట్లాడుతూ బిసిల సమస్యలను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తానని తెలిపారు.

## ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు

**కదిరి టౌన్ :** ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి రెండు కొత్త బస్సులను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో రవాణా సౌకర్యం మెరుగు పరచడానికి కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగా ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేస్తోందని తెలిపారు. కార్యక్రంలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నూతన బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

# క్రికెట్ సంబురం..!

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

జిల్లాలో ఇప్పుడు క్రికెట్ సంబురం నడుస్తోంది. జాతీయ స్థాయిలో అగ్రశ్రేణి టోర్నమెంటుగా చెప్పుకునే దులీప్ ట్రోఫి ఈసారి అనంతపురం నగరంలో నిర్వహించాలని బిసిసిఐ నిర్ణయించింది. ఈ మేరకు ఏర్పాట్లు సాగుతున్నాయి. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్, అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఇంతటి అతిపెద్ద టోర్నమెంట్ నిర్వహిస్తుండటంతో అగ్రశ్రేణి క్రికెటర్లు అందరూ విచ్చేయనున్నారు. ఈ ఆటగాళ్లను చూసేందుకు క్రికెట్ అభిమానులు కూడా ఉత్సాహం చూపుతున్నారు. మొత్తం 45 మందికిపైగా క్రీడాకారులు ఒక్కసారిగా రావడం, వారందరూ సుమారు 15 రోజులపాటు ఇక్కడే ఉండి దులీప్ ట్రోఫీలో పాల్గొననున్నారు. ఇప్పటి వరకు ఇంత పెద్ద టోర్నమెంట్ జిల్లాలో జరిగిన దాఖలాల్లేవు. 1964లో ఇరానీ ట్రోఫి ఒకటి పిటిసి మైదానంలో జరిగింది. ముంబయి, రెస్ట్ ఆఫ్ ఇండియా జట్లు ఈ మ్యాచ్‌లో ఆడాయి. ఆ తరువాత అప్పుడప్పుడు రంజీ మ్యాచ్‌లు జిల్లాలో నడుస్తూ వచ్చాయి. 1963లో ఆంధ్ర, హైదరాబాద్‌ల మధ్య రంజీ మ్యాచ్ జరిగింది. 2004-2005లో ఆంధ్ర, ఇండియన్ రైల్వేస్ మధ్య ఒక మ్యాచ్ జరిగింది. ఆ తరువాత 2005-06లో అత్యధికంగా రంజీ మ్యాచ్‌లో జరిగాయి. ఆంధ్ర, ఉత్తర ప్రదేశ్, కర్నాటక, హర్యానా, కేరళ జట్లు ఇక్కడ ఆడాయి. 2007-08లో ఆంధ్ర, ఉత్తరప్రదేశ్, 2019-20లో మణిపూర్, పాండిచ్చేరీ టీమ్‌లు తలపడ్డాయి. ఆ తరువాత నుంచి పెద్ద టోర్నమెంటులేవి జిల్లాకు రాలేదు. ఆ సమయంలో జహీర్ ఖాన్, మహమ్మద్ కైఫ్, అంబటి రాయుడు, రవీంద్ర జడేజా, సురేష్ రైనా, ఎంఎస్‌కె.ప్రసాద్, యూసుఫ్ పఠాన్, వేణుగోపాల్ రావు, ప్రవీణ్ కుమార్, రాబిన్ ఊతప్ప వంటి ఆటగాళ్లు దేశవాళీ మ్యాచ్‌లు ఆడుతున్న సమయంలో ఇక్కడ ఆడారు. మూడు, నాలుగేళ్ల తరువాత ఇంత పెద్ద టోర్నమెంట్ రావడం అది కూడా ప్రధానమైన ఆటగాళ్లు అంతా విచ్చేస్తుండటంతో యువతలో ఉత్సాహం నెలకొంది. ఈ నెల 5న ప్రారంభమ య్యే ఆటకు ప్రేక్షకులను అనుమతించేందుకు ప్రత్యేకమైన పాస్‌లను శనివారం పంపిణీ చేశారు. ఇదే సమయంలో వర్షాలు కూడా పడుతుండటం గమనార్హం. ఈ ఏడాది వర్షాలు తక్కువ ఉన్న ప్రాంతంలో దులీప్ ట్రోఫీ నిర్వహించాలని బిసిసిఐ అనంతపురంలో మ్యాచ్‌లను ఆడించే నిర్ణయం తీసుకుంది. అయితే జిల్లాలో గడిచిన రెండు రోజులుగా వర్షాలు పడుతుండటం గమనార్హం.




మ్యాచ్ ప్రారంభమయ్యేందుకు ఇంకా నాలుగు రోజులు సమయముంది. అంతలోపు వర్షాలు తగ్గితే మ్యాచ్‌లకు ఇబ్బంది ఉండకపోవచ్చునని నిర్వాహకులు చెబుతున్నారు. ఆర్డీటీ అనంతపురం స్పోర్ట్సు కాంప్లెక్సులో రెండు మైదానాల్లో ఈ మ్యాచ్‌లు జరుగనున్నాయి. వీటిని ప్రత్యక్ష ప్రసారం కూడా చేయనుండటంతో అక్కడికెళ్లలేని వారు ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించేందుకు వీలుంది. ఏది ఏమైనా అనంతపురం జిల్లాలో ఇంత పెద్ద టోర్నమెంటు జరగడం ఇదే మొదటి సారి. దీన్ని విజయవంతం చేయడానికి నిర్వాహకులు అన్ని రకాల ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేసియున్నారు.